ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తమిళనాడు
TAMILNADU

ఆదివారం 15 డిసెంబరు 2024

ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గానికి

మూడున్నరేళ్లలో రెండోసారి ఉప ఎన్నిక

చెన్నై, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన తండ్రీకొడుకుల మృతి కారణంగా మూడున్నరేళ్ల వ్యవధిలో రెండోసారి ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరుగనున్నాయి. 2021లో ఆ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఈవీకేఎస్ ఇళంగోవన్ కుమారుడు తిరుమగన్ పోటీ చేసి గెలిచారు. గతేడాది జనవరిలో ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ నియోజకవర్గానికి గత ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో ఆయన తండ్రి, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ పోటీ చేసి గెలిచారు. ఇళంగోవన్ కూడా 20 మాసాలే ఎమ్మెల్యేగా కొనసాగారు. ఈ పరిస్థితులలో మూడున్నరేళ్ల లోపే ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గానికి మళ్ళీ ఉప ఎన్నికలు జరుగనున్నాయి. శాసనసభ ఎన్నికలు జరిగేందుకు ఏడాదిన్నర వ్యవధి మాత్రమే ఉన్న నేపథ్యంలో జరిగే ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నికల్లో గెలిచే అభ్యర్థి 14 లేదా 15 మాసాల పాటే ఎమ్మెల్యేగా కొనసాగనున్నారు.

దక్షిణాది జిల్లాల

వరదపై సీఎం సమీక్ష

● పాల్గొన్న మంత్రులు, ఉన్నతాధికారులు


సమావేశంలో సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు

అడయార్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు దక్షిణాది జిల్లాల్లో ఏర్పడిన వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. శనివారం మధ్యాహ్నం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీనియర్ మంత్రి దురైమురుగన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి అముద, రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగ కమిషనర్ రాజేష్ లఖానీ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో ప్రధానంగా తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లోని వరద పరిస్థితిపై సీఎం సమీక్షించారు. ఈ జిల్లాల్లో రిజర్వాయర్లు, ప్రధాన చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆ జిల్లాల్లో వరద సహాయక చర్యలపై ఆయన ఆరా తీశారు. వరద బాధిత జిల్లాల్లో సహాయక పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సీఎం ఆదేశించారు. కాగా, రాష్ట్రంలోకి ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైన తర్వాత విస్తారంగా వర్షాలు కురుస్తున్న విషయం తెల్సిందే. ప్రధానంగా చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు, కళ్ళకుర్చి, విల్లుపురం, తిరువణ్ణామలైతో పాటు డెల్టా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. మూడు రోజుల క్రితం చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల్లో కురిసిన భారీ వర్షం కారణంగా చెన్నై నగరానికి తాగునీరు సరఫరా చేసే చెంబరంబాక్కం, పూండి చెరువులు పూర్తిగా నిండాయి. ముందు జాగ్రత్త చర్యగా ఈ రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేశారు. అలాగే, తెన్‌పెన్నై నది నుంచి నీటిని విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలను పర్యవేక్షణ కోసం మంత్రులు కేఎన్ నెహ్రూ, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్‌లతో సీనియర్ ఐఏఎస్ అధికారులను సీఎం పంపించారు. సీఎం స్టాలిన్ కూడా ఎప్పటికప్పుడు వరద సహాయక చర్యలపై సమీక్ష చేస్తూ, అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

ఈవీకేఎస్ ఇళంగోవన్ కన్నుమూత

స్టాలిన్ సహా నేతల నివాళి ● శోకసంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు


ఈవీకేఎస్ ఇళంగోవన్ (ఫైల్‌ఫొటో)


ఇళంగోవన్ కుటుంబీకులను పరామర్శిస్తున్న సీఎం

చెన్నై, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు, ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ (75) శనివారం ఉదయం కన్నుమూశారు. ప్రస్తుతం ఈరోడ్ ఈస్ట్ శాసనసభ్యుడిగాను ఉన్న ఇళంగోవన్ మనపాక్కంలో నివసిస్తున్నారు. రెండు నెలల క్రితం అనారోగ్యం కారణంగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. అనంతరం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఇంట్లోనే వున్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ 11న ఆయన తీవ్ర అస్వస్థతకు గురై మియాట్ ఆస్పత్రిలో చేరారు. అత్యవసర చికిత్స విభాగంలో వైద్యనిపుణులు పరీక్షలు జరిపి చికిత్స అందించారు. వారం రోజుల క్రితం ఆయన ఆరోగ్యం విషమించడంతో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల ఆస్పత్రికి వెళ్ళి ఇళంగోవన్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నెల రోజులుగా చికిత్స పొందుతున్న ఇళంగోవన్ శనివారం ఉదయం 10.32 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈ సమాచారం తెలియగానే కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు, పార్టీ శ్రేణులు శోకతప్తులయ్యారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పార్టీ అనుచరులతో కలిసి హుటాహుటిన మియాట్ ఆస్పత్రికి చేరుకున్నారు.

పెరియార్ మనవడు...

ఈవీకేఎస్ ఇళంగోవన్ ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్‌కు మనవడు. పెరియార్ సోదరుడు కృష్ణస్వామి కుమారుడైన ఈవీకే సంపత్, సులోచన దంపతులకు 1948 డిసెంబర్ 21న గోపిచెట్టిపాళయంలో ఇళంగోవన్ జన్మించారు. చెన్నై రాజధాని కళాశాలలో విద్యాభ్యాసం చేసి అర్థికశాస్త్రంలో బీఏ పట్టా పొందారు. 1967లో జాతీయ విద్యార్థి కాంగ్రెస్ రాష్ట్ర విభాగానికి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. యుక్తవయస్సులోనే ఆయన కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా పేరుతెచ్చుకున్నారు. ఆ తర్వాత ఎంపీగా, ఎమ్మెల్యేగా సేవలందించారు. మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో జౌళి శాఖ మంత్రిగాను పనిచేశారు. ఇళంగోవన్ భౌతికకాయాన్ని ఆస్పత్రి నుంచి మనపాక్కంలోని నివాసానికి తరలించారు. ఇళంగోవన్ అంత్యక్రియలు ఆదివారం రామాపురం శ్మశానవాటికలో జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.

సీఎం స్టాలిన్ నివాళి...

టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఇళంగోవన్ మృతివార్త తెలియగానే ముఖ్యమంత్రి స్టాలిన్ అందుబాటులో వున్న తన మంత్రివర్గ సహచరులతో హుటాహుటిన మనపాక్కం వెళ్లారు. ఇళంగోవన్ భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇళంగోవన్ సతీమణి వరలక్ష్మీతో పాటు ఇతర కుటుంబ సభ్యులను స్టాలిన్ ఓదార్చారు.

గవర్నర్, సీఎం సహా పలువురి సంతాపం

చెన్నై, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతిపట గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా రాజకీయ పార్టీల నేతలు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. గవర్నర్ విడుదల చేసిన సంతాప సందేశంలో ఈరోడ్ ఈస్ట్ నియోజవర్గం ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇలంగోవన్ మృతి తనకు తీరని దుఃఖాన్ని కలిగించిందని, రాష్ట్ర ప్రజలకు ఆయన చేసిన సేవలను మరువలేనివన్నారు. ఇలంగోవన్ మృతితో శోకతప్తులైన కుటుంబీకులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానన్నారు.

ఆత్మీయ మిత్రుడిని కోల్పోయా : స్టాలిన్

టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతి వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని, ఆత్మీయ మిత్రుడిని కోల్పోయానని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ సంతాప సందేశం వెలువరిస్తూ పెరియార్ సోదరుడు ఈవీకేఎస్ సంపత్ కుమారుడు ఇళంగోవన్ శాసనసభ్యుడిగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా, టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా విభిన్న పదవుల్లో అటు పార్టీకి, ఇటు ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. రెండేళ్ల క్రితం కుమారుడు తిరుమగన్ మృతి చెందినప్పటి నుండే ఇళంగోవన్ మానసికంగా బాగా క్రుంగిపోయారని , ఆ తర్వాత ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచాక మళ్ళీ ప్రజా సేవ చేయడానికి అవకాశం రావటంతో మానసికంగా ఊరట చెందుతున్నానని తనకు చెప్పారని స్టాలిన్ వివరించారు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో ఉన్నప్పుడు తనను చూడాలనుకుంటున్న విషయం తెలుసుకుని ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించి వచ్చానని తెలిపారు. ఇళంగోవన్ మృతి రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా తనకు తీరని లోటని స్టాలిన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఇదే విధంగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కూడా ఇళంగోవన్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

పార్టీకి తీరని లోటు : సెల్వపెరుంతగై

రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పేర్కొన్నారు.ఈమేరకు ఓ సంతాప ప్రకటన విడుదల చేస్తూ రెండు పర్యాయాలు టీఎన్‌సీసీ నేతగా, కేంద్ర మంత్రిగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా అటు పార్టీకి, ఇటు ప్రజానీకానికి ఇళంగోవన్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతితో బాధపడుతున్న కుటుంబీకులకు, పార్టీ శ్రేణులందరికీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. తన సోదర సమానుడిని కోల్పోయానని ఎండీఎంకే నేత వైగో, రాష్ట్ర కాంగ్రెస్ నేతగా నిర్భీతిగా వ్యవహరించి నేత ఇళంగోవన్ అంటూ డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, ఇళంగోవన్ మృతి తనకు తీరని ఆవేదన కలిగించిందంటూ తమిళగ వెట్రి కళగం నేత, నటుడు విజయ్, పార్టీ శ్రేణుల్లో ఎల్లప్పుడూ ఉత్సాహాన్ని నింపే నేత ఇలంగోవన్ అని టీఎంసీ నేత జీకే వాసన్ వేర్వేరు సంతాప ప్రకటనల్లో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, ద్రవిడ కళగం నేత కె.వీరమణి, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, సీపీఎం నేత బాలకృష్ణన్, మాజీ ఎంపీ తిరునావుక్కరసర్, న్యూజస్టిస్ పార్టీ నేత ఏసీ షణ్ముగం, ఇందియ జననాయగకట్చి నేత రవి పచ్చముత్తు తదితర నాయకులు ఇళంగోవన్ మృతికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

నేడు వియత్నాంకు ఎమ్మెల్యేల బృందం

అడయార్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత్ - వియత్నాం దేశాల మధ్య స్నేహసంబంధాల వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నుంచి ఎమ్మెల్యేల బృందం వియత్నాంకు ఆదివారం బయలుదేరి వెళ్లనుంది. రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు సీఎం స్టాలిన్‌ను కలుసుకున్నారు.. ఈ వేడుకలను సీపీఐ, వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీలు సంయుక్తంగా ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నాయి. ఈ బృందంలో వీసీకే ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎస్ బాలాజీ, డీఎంకే విద్యార్థి విభాగం కార్యదర్శి, ఎమ్మెల్యే సీవీఎంపీ ఎళిలరసన్, ఎండీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి మల్లై సత్య, వైద్యుల సంఘం అధ్యక్షుడు జీఆర్ రవీంద్రనాథ్ సభ్యులుగా ఉన్నారు.

దేశ విస్తృత ప్రయోజనాలే ముఖ్యం

● పొంగులేటి సుధాకర్ రెడ్డి


మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి, తదితరులు

అడయార్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' అంశంలో దేశ విస్తృత ప్రయోజనాలను చూడాలని తమిళనాడు బీజేపీ జాతీయ ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా తిరువేర్కాడు, ఆవడి ఈస్ట్, ఆవడి నార్త్, ఆవడి సౌత్ మండల అధ్యక్షులు ఎన్నిక ఆవడిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఒకే దేశం - ఒకే ఎన్నిక దేశ విస్తృత ప్రయోజనాలకు అవసరమన్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీలు సంకుచిత రాజకీయ కోసం 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్'ను వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఇదే అంశంపై తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా విస్తృత అభిప్రాయాలు సేకరించిన తర్వాతే మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కమిటీ తుది నివేదిక ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నేతలు ఎం.చక్రవర్తి, పార్థసారథి, ఎం.భాస్కరన్, ఆర్య శ్రీనివాసన్, జై గణేష్, అశ్విన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్

నేడు అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం


వానగరం వేదిక వద్ద జయలలిత, ఎడప్పాడి చిత్రాలతో ఏర్పాటైన ప్రవేశ ద్వారం

చెన్నై, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం ఆదివారం జరుగనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహ రచన, ఏయే పార్టీలతో పొత్తు పెట్టుకోవాలన్నదానిపై ఆదివారం జరుగనున్న అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశం, కార్యాచరణ మండలి సమావేశాల్లో చర్చించనున్నారు. వానగరంలోని శ్రీవారు కల్యాణమండపంలో ఈ సమావేశం జరుగనుంది. రాష్ట్రంలో 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకేకు ధీటుగా బలమైన కూటమిని ఏర్పాటు చేయడానికి అన్నాడీఎంకే పావులు కదుపుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో పీఎంకే తదితర పార్టీలను తమ కూటమిలో చేర్చుకునేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తీవ్రంగా ప్రయత్నించారు. చివరి క్షణంలో పీఎంకే బీజేపీ కూటమిలో చేరింది. ఆ కారణంగానే పార్టీ ఓటమి పాలైందని అన్నాడీఎంకే సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ ఎన్నికలకు పటిష్ఠమైన పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని ఈపీఎస్ భావిస్తున్నారు. పార్టీకి దూరమైనవారిని మళ్ళీ చేర్చుకునే విషయంపై కూడా పార్టీ సీనియర్లతో కలిసి నిర్ణయం తీసుకోవాలని ఈపీఎస్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్ మగన్ హుసేన్ అధ్యక్షతన ఆదివారం ఆ పార్టీ కార్యాచరణ మండలి, సర్వసభ్య సమావేశాలు జరుగనున్నారు.

5 వేలమందికి ఆహ్వానాలు...

ఈ సమావేశాల్లో పార్టీ కార్యాచరణ మండలి, సర్వసభ్యమండలికి చెందిన 3 వేలమంది సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా పార్టీ సీనియర్లు సహా సుమారు రెండు వేల మంది మొత్తం 5 వేలమంది పాల్గొననున్నారు. వీరందరికీ ఆహ్వానాలను పంపినట్లు పార్టీ నాయకుడు బెంజమిన్ తెలిపారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు కుదుర్చుకుని కూటమిని ఏర్పాటు చేసే అధికారాన్ని ఈపీఎస్‌కు కల్పిస్తూ ఈ సమావేశాల్లో ప్రత్యేక తీర్మానాలు చేయనున్నారు. ఈ రెండు సమావేశాల్లో పాల్గొననున్న పార్టీ నేతలు, ప్రముఖులు కార్యకర్తలకు మాంసాహారం, శాఖాహారం విందు ఏర్పాటు చేస్తున్నా రు. ప్రస్తుతం శ్రీవారు కల్యాణమండపానికి వెళ్లే రహదారుల్లో అన్నాడీఎంకే జెండాలు, బ్యానర్లు, అరటి, మామిడి తోరణాలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి స్థానిక పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సి.విజయభాస్కర్ తదితరులు

అమరజీవి స్మారక భవనాన్ని ఆదుకోండి

● ఏపీ ప్రభుత్వానికి అజంతా శంకరరావు విజ్ఞప్తి

● ఘనంగా 'చెన్నపురిలో తెలుగుతేజం' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో తెలుగు ప్రముఖులు

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో తెలుగు భాషా సంస్కృతులకు చెరగని చిరునామాగా ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనాన్ని ఆదుకోవాలని 'అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి' అధ్యక్షుడు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే 'నెల నెలా వెన్నెల'లో భాగంగా అమరజీవి వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని 'చెన్నపురిలో తెలుగుతేజం - అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం' అనే గ్రంథావిష్కరణ శనివారం రాత్రి మైలాపూర్‌లోని ఆంధ్రమహిళా సభలో జరిగింది. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అజంతా శంకరరావు మాట్లాడుతూ... ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు వారందరికీ చిరస్మరణీయులని కొనియాడారు. అమరజీవిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమరజీవి స్మారక భవనం అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించాలని కోరారు. వచ్చే ఏడాది నుంచి అమరజీవి పేరిట అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆయన సభాముఖంగా ప్రకటించారు. అనంతరం రచయిత్రి సరోజిని ప్రేమ్‌చంద్ రూపొందించిన చెన్నపురిలో తెలుగుతేజం పుస్తకాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజధాని కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎల్‌బీ శంకరరావు ఆవిష్కరించారు. తొలిప్రతిని రాజ్యలక్ష్మీ ఫౌండేషన్ అధినేత్రి పి.పూర్ణిమ స్వీకరించారు. ఈ సభలో ఆచార్య ఎల్.బి.శంకరరావు మాట్లాడుతూ... పొట్టి శ్రీరాములు నిస్వార్థ దేశభక్తుడు, త్యాగశీలి అని కీర్తించారు. గౌరవ అతిథిగా హాజరైన డీజీ వైష్ణవ కళాశాల విశ్రాంతాచార్యులు, కవి, విమర్శకులు డాక్టర్ కాసల నాగభూషణం... పొట్టి శ్రీరాములు, వైఎస్ శాస్త్రి, వై.రామకృష్ణ, బాపు చేసిన సేవలు చిరస్మరణీయమంటూ పద్యాలతో అలరించారు. సభా నిర్వహణను డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాల తెలుగు సహాయాచార్యులు డాక్టర్ కల్పనా గుప్తా చేపట్టారు. ముందుగా తెలుగు ప్రముఖులంతా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి జలంధర, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, ప్రముఖ రచయిత్రి సరోజని ప్రేమ్‌చంద్, జయశ్రీ, గుర్రం బాలాజీ, గుడిమెట్ల మాధురి, వసుంధర తదితర సాహితీప్రియులు పాల్గొన్నారు.

సమాచార దృష్టి

17 వరకు పబ్లిక్ పరీక్షల దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాసే ప్రైవేటు అభ్యర్థులు ఈ నెల 17వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల శాఖ తెలిపింది. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో జరుగనున్న ఈ పరీక్షలకు ప్రైవేటు అభ్యర్థుల నుంచి దరఖాస్తు స్వీకరణ ఈ నెల 7వ తేది నుంచి ప్రారంభమైంది. ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ సేవా కేంద్రాల ద్వారా అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలి. పరీక్ష ఫీజు, దరఖాస్తు విధానం, సమర్పించాల్సిన సర్టిఫికెట్లు తదితరాలకు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించాలని పరీక్ష శాఖ తెలిపింది.

వచ్చే నెల 21 నుంచి 'అగ్ని వీర్' శిబిరాలు

పెరంబూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో 'అగ్ని వీర్' పథకంలో అభ్యర్థుల నియామక శిబిరం కాంచీపురంలో జరుగనుంది. ఈ మేరకు కాంచీపురం జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో... భారత సైన్యంలో అగ్ని వీర్ కింద సైనికులు, నర్సింగ్ అసిస్టెంట్ పోస్టుల నియామక శిబిరం కాంచీపురం అన్నా జిల్లా క్రీడా మైదానంలో జనవరి 21 నుంచి 31వ తేదీ వరకు జరుగనుంది. ఆసక్తి కలిగిన వారు www.joinindianarmy.nic.in అనే వెబ్‌సైట్‌లో తగిన సర్టిఫికేట్లతో దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

చెన్నై-తూత్తుకుడి విమాన సేవల రద్దు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో చెన్నై నుంచి తూత్తుకుడికి ఆదివారం వరకు విమాన సేవలు రద్దయ్యాయి. శనివారం నగరం నుంచి తూత్తుకుడికి వెళ్లిన రెండు విమానాలు, ల్యాండింగ్‌కు అనుకూల వాతావరణం లేకపోవడంతో మళ్లీ నగరానికి తిరిగొచ్చాయి. ఈ కారణంగా శని, ఆదివారాల్లో చెన్నై-తూత్తుకుడి మధ్య విమాన సేవలు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

గ్రూప్-2, 2ఏ పాఠ్యాంశాల మార్పు

పెరంబూర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, 2ఏ పాఠ్యాంశాల్లో మార్పులు చేపట్టినట్లు తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) తెలిపింది. ఈ మేరకు టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ శాఖలకనుగుణంగాను, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ పరీక్షలో జనరల్ తమిళ్, జనరల్ ఇంగ్లీషు పాఠ్యాంశాల్లో మార్పులు చేపట్టారు. అలాగే, గ్రూప్-4 పోస్టులకు తమిళం అర్హత పాఠ్యాంశాల్లోనూ మార్పులు చేపట్టామని, పాఠ్యాంశాల మార్పులను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

అశోక్ లేలాండ్‌కు రవాణా శాఖ ఆర్డర్

పెరంబూర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) రూ.346 కోట్లతో డీజిల్ బస్సుల తయారీ ఆర్డరును అశోక్ లేలాండ్ చేజిక్కించుకుంది. చెన్నై ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న అశోక్ లేలాండ్ శుక్రవారం షేర్‌మార్కెట్లో విడుదల చేసిన ప్రకటనలో.. డీజిల్‌తో నడిచే 1,475 బీఎస్-6 రకం బస్సులు తయారుచేసే ఆర్డర్ తమ సంస్థ పొందిందన్నారు. ఈ నెల నుంచి 2025 మే వరకు బస్సులుడెలివరీ చేయనున్నట్లు, ఈఆర్డర్ విలువ రూ.436 కోట్లు అని అశోక్ లైలాండ్ ప్రకటించింది. కాగా, ఈ ప్రకటనతో అశోక్ లేలాండ్ షేర్ విలువ 1శాతం పెరిగి రూ.232గా నమోదైంది.

మెట్రోలో రూ.168 కోట్లతో ఎలక్ట్రికల్, మెకానికల్ సిస్టమ్

పెరంబూర్, డిసెంబరు 14: నగరంలో రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్ట్‌లో మాధవరం డెయిరీ నుంచి కోయంబేడు స్టేషన్ వరకు 10 హైలెవల్ స్టేషన్లు, 6 సబ్ వే మెట్రోస్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. ఈ మెట్రోస్టేషన్‌లలో విద్యుత్, ఫైర్ ప్రొటెక్షన్, వెంటిలేషన్, ఏసీ వంటి ఎలక్ట్రికల్, మెకానికల్ సిస్టమ్ పనులను జాక్సన్ లిమిటెడ్ చేజిక్కించుకుంది.వాటి విలువ రూ.168.16 కోట్లు. సీఎంఆర్‌ఎల్ సిస్టమ్స్ అండ్ ఆపరేషన్ డైరెక్టర్ రాజేష్ చతుర్వేది, జాక్సన్ లిమిటెడ్ వైస్ చైర్మెన్ అంకర్ గోయల్‌లు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

డిక్లరేషన్ ఫారం సమర్పణకు అవకాశం

పెరంబూర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): యూజీ వైద్య కోర్సులందిస్తున్న విద్యా సంస్థలు ప్రతి ఏడాది అంగీకారం పత్రం (డిక్లరేషన్ ఫారం) సమర్పించాల్సి ఉంటుంది. ఈ పత్రాలు జాతీయ వైద్య కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) వెబ్‌సైట్‌లో నమోదు గడువు ఇటీవల ముగిసింది. ఈ నేపథ్యంలో, పలు విద్యా సంస్థలు అంగీకారం పత్రాలను రూ.20 వేల జరిమానాతో ఈ నెల 20వ తేది వరకు సమర్పించాలని ఎన్‌ఎంసీ ప్రకటన విడుదల చేసింది.

17 వరకు కొండ రైలు రద్దు

పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొండ రైలు సేవలు మరో మూడు రోజులు రద్దుచేశారు. భారీవర్షాల కారణంగా కొండ రైలు మార్గంపై మట్టిచెరియలు, చెట్లు కూలి పడుతున్నాయి. దీంతో, ముందు జాగ్రత్త చర్యగా గత రెండు రోజులుగా కొండ రైలు సేవలు నిలిపివేశారు. ప్రస్తుతం వర్షాల తగ్గకపోవడంతో 15,16,17 తేదీల్లో కొండ రైలు సేవలు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

చెరకు క్రషింగ్ ప్రారంభం


క్రషింగ్ ప్రారంభిస్తున్న మంత్రి గాంధీ

వేలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార చక్కెర ఫ్యాక్టరీలో ఈ ఆర్థిక సంవత్సరానికి చెరకు క్రషింగ్‌ను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గాంధీ ప్రారంభించారు. ఈ ఫ్యాక్టరీ 2023-24వ సంవత్సరంలో 2,02,419 టన్నుల చెరకు క్రషింగ్ చేసి, 1,91,950 క్వింటాళ్ల చక్కెర తయారుచేసింది. ఈ ఏడాది 2024-25లో 1.80లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని నిర్ణయించారు. శనివారం చెరకు క్రషింగ్ ప్రారంభించిన మంత్రి గాంధీ, రైతులకు రూ.3.84 కోట్ల సబ్సీడీ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, ఆర్కాడు ఎమ్మెల్యే ఈశ్వరప్పన్, వేలూరు కో-ఆపరేటివ్ చక్కెర ఫ్యాక్టరీ రిజిస్ట్రార్ నర్మద, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షులు వేల్ మురుగన్, ఉపాధ్యక్షుడు శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచెందూర్ తీరంలో స్నానాలకు నిషేధం


ప్రజలను లౌడ్ స్పీకర్ల ద్వారా హెచ్చరిస్తున్న పోలీసులు

పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సముద్రతీరంలో సుబ్రమణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు సమీపంలోని సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటుంటారు. ఈ నేపథ్యంలో, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తిరుచెందూర్ సముద్ర తీరంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో, తీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు, పర్యాటకులు అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ పోలీసులు లౌడ్ స్పీకర్ల ద్వారా హెచ్చరిస్తున్నారు. అలాగే, భారీవర్షాల కారణంగా తిరుచెందూర్ ఆలయానికి రెండు రోజులు భక్తులు రావడం తగ్గించాలని జిల్లా కలెక్టర్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలి

● కళ్లకురిచ్చి కలెక్టర్ ప్రశాంత్

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లాలో ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉత్తీర్ణతను 100 శాతం సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ సూచించారు. కళ్లకురిచ్చి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో శనివారం సమావేశమైన కలెక్టర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం మెరుగుపడేందుకు తీసుకోవలసిన సూచనలు, బోధనాతీరు, తదితరాలపై మెలుకువలు నేర్పించారు. ఆయన 10,12వ తరగతుల పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టే విధంగా విద్యా నిర్వహణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

వరదనీటికి కొట్టుకొచ్చిన ఏనుగు కళేబరం


కుట్రాలం జలపాతం వద్ద ఏనుగు కళేబరం

పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుట్రాలం కొండల నుంచి దొర్లుతూ మూడేళ్ల ఏనుగు మృతిచెందింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో డెల్టా జిల్లాల్లో శుక్రవారం అతిభారీ వర్షాలు కురిశాయి. ముందస్తు చర్యల్లో భాగంగా తెన్‌కాశిలోని కుట్రాలం జలపాతం వద్ద పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో, భారీ వర్షాలతో కుట్రాలం జలపాతం వద్ద ఎన్నడూ లేని విధంగా నీటి ప్రవాహం అధికమైంది. ఈ నేపథ్యంలో, కుట్రాలం కొండ ప్రాంతాల్లో భారీవర్షాల్లో చిక్కుకొని మృతిచెందిన మూడేళ్ల ఏనుగు కళేబరం కొట్టుకుంటూ వచ్చింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

వరద నీటిలో హాస్టల్ విద్యార్థుల ఇక్కట్లు


అస్వస్థతకు గురైన విద్యార్థిని తీసుకెళ్తున్న సహచర విద్యార్థులు

పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం అయ్యప్పన్ నగర్‌లో ఆదిద్రావిడ సంక్షేమ హాస్టల్ ఉంది. కొద్ది రోజులుగా జిల్లాలో భారీవర్షాలు కురుస్తుండడంతో హాస్టల్ ప్రాంగణంలో భారీగా వరద నీరు చేరింది. ఈ నేపథ్యంలో, హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో సహచర విద్యార్థులు వారిని నీళ్లలో మోసుకుంటూ వెళ్లి ఆసుపత్రిలో చేర్పించారు. అంటువ్యాధులు ప్రబలక ముందే హాస్టల్ ప్రాంగణంలోని వరద నీరు తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పుదువై మంత్రికి తృటిలో తప్పిన ప్రమాదం

పుదుచ్చేరి, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): వరద బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తుండగా పుదుచ్చేరి మంత్రికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పుదుచ్చేరి రాష్ట్రం అతలాకుతలమైన విషయం తెల్సిందే. లోతట్టు ప్రాంతాల్లోని గృహాలు నీట మునిగాయి. వరద బాధిత ప్రాంతాల్లో మంత్రి తిరుమురుగన్ శుక్రవారం పరిశీలిస్తుండగా, తిరునల్లారు - విళుదియూర్ ప్రాంతాలను కలిపే వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. ఈ వంతెన కూలడానికి కొన్ని క్షణాల ముందు మంత్రి కాన్వాయ్ వంతెన దాటి వెళ్ళింది. దీంతో మంత్రి తృటిలో ప్రాణగండం నుంచి తప్పించుకున్నారు.

వరదలో చిక్కుకున్న భక్తులు

అడయార్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇదిలావుంటే, జిల్లాలోని కడయనల్లూరులో శుక్రవారం భారీ వర్షం కురిసింది. కార్తీక మాసం చివరి శుక్రవారం కావడంతో పెరియారు దాటుకుని పెరియనాయగం అయ్యనార్ ఆలయానికి వెళ్ళిన భక్తులు వరద నీటిలో చిక్కుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణమురళి అధికారులతో కలిసి ఇద్దరు పిల్లలు, తొమ్మిది మంది మహిళల సహా 38 మంది భక్తులను క్షేమంగా రక్షించారు. మరో వంద మంది భక్తులను ఆలయ అధికారులు సురక్షితమైన ప్రాంతానికి తరలించారు.

ఆలయాల్లో ఫిర్యాదులకు ఎలక్ట్రానిక్ యంత్రాలు

● వడపళనిలో ప్రారంభించిన దేవాదాయ శాఖ మంత్రి

అడయార్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు వచ్చే భక్తులు స్వామి దర్శనం తర్వాత తమ అనుభవాలు తెలిపేందుకు, ఫిర్యాదులు చేసేందుకు ఎలక్ట్రానిక్ యంత్రాలను ఏడు ఆలయాల్లో అమర్చినట్టు రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. వడపళనిలోని మురుగన్ ఆలయంలో ఏర్పాటు చేసిన ఈ యంత్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అలాగే, ధర్మకర్తల మండలి నిధి రూ.33.85 లక్షలతో తయారు చేసిన వెండి తలుపులను ఆలయ పాలక మండలికి అప్పగించారు. రూ.10 లక్షలతో కొనుగోలు చేసిన శీతలీకరణ యంత్రాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆలయాలకు వచ్చే భక్తులు తమ ఫిర్యాదులు, సలహాలు, స్వామి దర్శనం తర్వాత తమ అనుభవాలను తెలియజేసేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ అడ్వైజ్ అండ్ కంప్లైంట్ మెషిన్‌లను తొలి దశలో వడపళని, మైలాపూర్, తిరువొత్రియూర్, పళని, తిరుత్తణి, శ్రీరంగం, మరుదమలై ఆలయాల్లో ఏర్పాటు చేశామన్నారు.

కూవం నదిలో పడిన మహిళ

రక్షించిన పోలీసులు


ఎక్సకవేటర్‌తో మహిళను రక్షిస్తున్న దృశ్యం

పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): స్థానిక కోయంబేడు సమీపంలోని కూవం నదిలో పడిన మహిళను ఎక్సకవేటర్ ద్వారా రక్షించారు. శుక్రవారం సాయంత్రం దేవి అనే మహిళ కూవం నదిలో పడిపోయింది. ఆమె వేసిన కేకలకు ఆ ప్రాంతంలో గస్తీ తిరు గుతున్న సాయుధ దళ కానిస్టేబుల్ వినోద్ ఆమెను రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో, భారీ ప్రొక్లయినర్ రప్పించి మహిళను సురక్షితంగా వెలికితీసి, చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డిగ్రీ టీచర్లకు ఉద్యోగ నియామకాలు

● పీఎంకే నేత డాక్టర్ రాందాస్

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల్లో ఖాళీ అయిన టీచర్ల పోస్టుల భర్తీ చేసేందుకు ఎంపిక చేసిన 3,192 మంది డిగ్రీ టీచర్లకు వేంటనే నియామక పత్రాలు అందజేయాలని పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిగ్రీ టీచర్ల ఎంపిక ప్రకటన 2023 అక్టోబర్ 25న విడుదలైంది. ఇందుకోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 4వ తేదీ నిర్వహించిన రాత పరీక్షల ఫలితాలు మే 18వ తేదీ విడుదల చేశారు. తర్వాత జూన్‌లో సర్టిఫికెట్లు పరిశీలించి టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా జులై 18న విడుదల చేశారు. ఐదు నెలు గడిచినా ఈ టీచర్ ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలు ఇవ్వకపోవడంపై రాందాస్ స్పందించారు. దీనిపై ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ డిగ్రీ టీచర్ల సంఖ్యను 8 వేలకు పెంచి ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

డీఎంకే కార్యవర్గ సమావేశం వాయిదా

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలు, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో డీఎంకే ఎంపీలు పలు సమస్యలు ప్రస్తావించాల్సి ఉండడంతో, ఈ నెల 18న నిర్వహించాల్సిన పార్టీ కార్యవర్గ సమావేశం వాయిదావేసినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. స్థానిక అన్నా అరివాలయంలో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో జరగాల్సిన సమావేశం వాయిదావేసినట్లు, తదుపరి సమావేశం నిర్వహించే తేది త్వరలో ప్రకటిస్తామని దురైమురుగన్ తెలిపారు.

పెట్టుబడుల అవుట్‌లుక్ ఆవిష్కరణ

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి దారులు, పెట్టుబడులకు సంబంధించి 2025వ సంవత్సరానికి గాను అవుట్ లుక్ నివేదికను కోటక్ సెక్యూరిటీస్ ఆవిష్కరించింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీపాల్‌షా మీడియాతో మాట్లాడుతూ, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఒకటిగా భారతదేశం తన స్థానాన్ని కొనసాగిస్తోందన్నారు. తమ అవుట్ లుక్ ఆవిష్కరణలో స్థూల, ఆర్థిక దృక్పథానికి ప్రాధాన్యత కల్పించామని, పెట్టుబడిదారులు కొంత జాగ్రత్తగా అడుగులు వేయాలన్నారు. దేశీయ ప్రాథమిక అంశాలు పటిష్ఠంగా ఉంటాయన్న ఆయన బంగారం, వెండికి పెట్టుబడులు మరింత ప్రకాశవంతంగా ఉంటాయని తెలిపారు.

పుదువైలో హెల్మెట్ తప్పనిసరి

● జనవరి నుంచి అమలు

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో జనవరి నుంచి ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ రాష్ట్రంలో 2017 మే నెలలో ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని ఆదేశిస్తూ ఇచ్చిన ఉత్తర్వులకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఆ తర్వాత పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఐపీఎస్ అధికారిణి కిరణ్ బేడి హెల్మెట్ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు మాత్రమే ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరిస్తున్నారు. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం 2025 జనవరి నుంచి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, దీనిని పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ


విజేతలతో వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్

వేలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్ సతీమణి రాజేశ్వరి 17వ వర్ధంతి సందర్భంగా వేలూరు వీఐటీ వర్సిటీ, పాఠశాల విద్యార్థులకు హాకీ, చెస్ సహా 15 రకాల పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో, వర్సిటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్ పాల్గొని, క్రీడా పోటీల విజేతలకు షీల్డులు, బహుమతులు అందజేశారు. వీఐటీ స్పోర్ట్స్ డైరెక్టర్ త్యాగచందన్ సహా వర్సిటీ స్పోర్ట్స్ అధికారులు పాల్గొన్నారు.

మధుమేహంతో బాధపడుతున్న పిల్లలకు ఇన్సులిన్

పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'టైప్ 1' మధుమేహంతో బాధపడుతున్న 2,500 మంది పిల్లలకు 'ఇన్సులిన్' ఇంజక్షన్ వినియోగిస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో మధుమేహం బాధితుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా 'మక్కలై తేడి మరుత్తువమ్' పథకం ప్రారంభించి, బీపీ, షుగర్ తదితరాలతో బాధపడుతున్న వారిళ్లకే వెళ్లి వైద్య పరీక్షలు, మందులు అందిస్తున్నామని తెలిపారు. ఈ పథకంలో 49.46 లక్షల మంది షుగర్ వ్యాధిగ్రస్తులు, 44.46 లక్షల మంది బీపీ బాధితులు మొత్తం 94.08 లక్షల మందికి చికిత్స అందిస్తున్నామన్నారు. అలాగే, టైప్ 1 షుగర్ లక్షణాలతో బాధపడుతున్న చిన్నారులకు ఇన్సులిన్ అందించే పథకం ప్రారంభించి, ప్రస్తుతం 2,500 మంది చిన్నారులకు ఇన్సులిన్ వేస్తున్నామని అన్నారు. అలాగే, షుగర్ వ్యాధిగ్రస్తులకు 'పాదం పాదుకాప్పోం' పథకంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేసే సదుపాయం కల్పించామని, ఆ ప్రకారం, ప్రపంచంలో షుగర్ వ్యాధిగ్రస్తుల పర్యవేక్షణలో తమిళనాడు మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి తెలిపారు.

పూర్తిస్థాయికి కలిన్‌జార్ చెరువు

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక


లౌడ్ స్పీకర్ ద్వారా ప్రజలను హెచ్చరిస్తున్న అధికారులు

వేలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పాలారు నదిలో వరదలు సంభవించాయి. పాలారు జలాలను కాట్పాడి ప్రాంతంలోని కలిన్‌జార్ చెరువుకు మళ్లించడంతో, చెరువు పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. ఈ చెరువును కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, 1వ మండల ఉప కమిషనర్ వసంతి, ఆరోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కార్పొరేటర్ టిట్టర్ శరవణన్ పరిశీలించారు. చెరువు సమీపంలోని పిల్లలు, పెద్దలు వెళ్లరాదంటూ అధికారులు లౌడ్ స్పీకర్ ద్వారా హెచ్చరించారు.

ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించిన ఇద్దరు ఖైదీలు

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ సెంట్రల్ జైలులో ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించిన ఇద్దరు మహిళా ఖైదీలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. వ్యాసర్పాడిలో గంజాయి విక్రయించిన అళమేలు (30), పార్వతి (36) ఇద్దరు మహిళలను గత నెల 9వ తేదీన అరెస్టు చేసిన కొడుంగైయూర్ పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో వారిపై ప్రయోగించిన గూండా చట్టం ఉత్తర్వులను జైలు అధికారులకు సమర్పించేందుకు వెళ్లిన ఇన్‌స్పెక్టర్ శరవణన్‌ను ఆ ఇద్దరు మహిళలు దూషించి, బెదిరించినట్లు తెలిసింది. జైలర్ ఫిర్యాదు మేరకు ఆ మహిళలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఘాట్ రోడ్‌లో రాత్రి ప్రయాణాలొద్దు

● తేని జిల్లా కలెక్టర్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొండ రోడ్డు మార్గంలో రాత్రి వేళ ప్రయాణాలు విరమించుకోవాలని తేని జిల్లా కలెక్టర్ షాజీవన తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... తేని జిల్లా కుళిని కొండ మార్గం, కంభంమేట్టు, పోడిమెట్టి, పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లోని రోడ్లపై చెట్లు విరిగి పడే అవకాశముందన్నారు. అందువల్ల ప్రజలు, అయ్యప్ప భక్తులు సాధ్యమైనంత వరకు ఈ మార్గాల్లో రాత్రి వేళ ప్రయాణం విరమించుకోవాలని కలెక్టర్ సూచించారు.

● భారీవర్షాల ఎఫెక్ట్...

శ్రీవైకుంఠం జైలు నుంచి ఖైదీల తరలింపు



పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల ముందస్తు చర్యల్లో భాగంగా శ్రీవైకుంఠం జిల్లా జైలు నుంచి 25 మంది ఖైదీలను పేరూరణి జైలుకు తరలించారు. తూత్తుకుడి జిల్లాలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో తామ్రభరణి నదిలో వరద ప్రవాహం అధికం కావడంతో శ్రీ వైకుంఠం నదిలోకి 60వేల ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. గత ఏడాది సంభవించిన వరదలను దృష్టిలో ఉంచుకొని వాతావరణ కేంద్రం జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. గత ఏడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు తామ్రభరణి జలాశయం నుంచి విడుదల చేసిన నీరు ఆ ప్రాంతంలోని ప్రభుత్వాసుపత్రి, జైళ్లలో ప్రవేశించాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో ఇన్‌పేషంట్లుగా ఉన్న 25 మందిని గురువారం, శుక్రవారం మరో 15 మందిని డిశ్చార్జి చేశారు. ఈ క్రమంలో, శ్రీ వైకుంఠం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న జైలులో ఉన్న 25 మంది ఖైదీలను శుక్రవారం రాత్రి తూత్తుకుడి పేరూరణి జిల్లా జైలుకు సాయుధదళం ఇన్‌స్పెక్టర్ మురుగన్ నేతృత్వంలో భారీ బందోబస్తు నడుమ తరలించారు.

విద్యుత్ స్కూటర్‌లో మంటలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన ఎలక్ట్రిక్ స్కూటర్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగడం కలకలం రేపింది. తిరుముల్లైవాయల్ శాంతిపురానికి చెందిన అఖిలేష్, అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అఖిలేష్ శుక్రవారం ఇంటి నుంచి స్కూటర్‌లో పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల పార్కింగ్ ప్రదేశంలో స్కూటర్ నిలిపి లోనికి వెళ్లాడు. ఆ స్కూటర్ నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన పాఠశాల బస్సు డ్రైవర్లు, మంటలు అదుపుచేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడకు చేరుకొనేలోపు స్కూటర్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై తిరుముల్లైవాయల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగం పేరిట రూ.39 లక్షల మోసం

● ఇంజనీర్ అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.39 లక్షలు కాజేసిన ఇంజనీర్ కటకటాలపాలయ్యాడు. తిరువాన్మియూర్ తిరువళ్లువర్ నగర్ మెయిన్ రోడ్డుకు చెందిన రాజశేఖర్ నగల దుకాణం నడుపుతున్నాడు. పెరుంగుడిలోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్న రమేష్ (36) నగల దుకాణం దగ్గరలోనే ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఈ క్రమంలో, రమేష్-రాజశేఖర్ మధ్య స్నేహం ఏర్పడింది. తన అల్లుడికి ఉద్యోగం లేదని రాజశేఖర్ చెప్పండంతో, తనకు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పరిచయమని, వారితో చెప్పి సచివాలయంలో ఉద్యోగం వేయిస్తామని రమేష్ తెలిపాడు. అతని మాటలు నమ్మిన రాజశేఖర్, ఉద్యోగం కోసం రమేష్ ఖాతాకు రూ.39 లక్షలు బదిలీ చేశాడు. అనంతరం రమేష్ కనిపించకపోవడంతో అనుమానించిన రాజశేఖర్ ఆవడి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టిన పోలీసులు, ఆంధ్ర రాష్ట్రం తిరుపతిలో తలదాచుకున్న రమేష్‌ను అరెస్ట్ చేశారు.

వరదలపై అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వరదల కోసం అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు చేపడతామని తిరునల్వేలి జిల్లా కలెక్టర్ కార్తికేయన్ హెచ్చరించారు. గత ఏడాది కురిసిన వర్షాలకు కలెక్టర్ కార్యాలయంలో భారీగా వరద నీరు చేరింది.ప్రస్తుతం ఈ ఫొటో వేసి ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయ పరిస్థితి అంటూ సోషల్ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి. ఈ విషయమై స్పందించిన కలెక్టర్, వరదలపై అసత్య ప్రచారాలు చేసే వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.

పట్టా మార్చేందుకు లంచం

● డీటీ, వీఏఓ అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టా మార్పిడికి రూ.15 వేలు లంచం ఆశించిన డిప్యూటీ తహసీల్దార్, వీఏఓలను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఈరోడ్ జిల్లా పాల్లపాళయం ప్రాంతానికి చెందిన ధనశేఖరన్, పట్టా మార్పు కోరుతూ పల్లపాళయం ఎ.అగరం గ్రామ నిర్వాహక కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. పెరుందురై తాలూకా మండల డిప్యూటీ తహసీల్దార్ నల్లసామి, పల్లపాళయం ఎ అగరం వీఏఓ శరత్‌కుమార్ తదితరులు, పట్టా మార్పుకు రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో, ధనశేఖరన్ జిల్లా అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించాడు. అధికారుల సూచనలతో డీటీ, వీఏఓలకు రసాయనాలు పూసిన రూ.15 వేల కరెన్సీ ధనశేఖరన్ అందజేస్తుండగా, అక్కడ మాటువేసిన అధికారులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్ చేసి, ఈరోడ్ ప్రధాన కోర్టు మేజిస్ట్రేట్ శక్తివేల్ ఎదుట హాజరుపరచి, రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు.

గూడువాంజేరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

● రూ.1.5లక్షల స్వాధీనం

చెన్నై, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా గూడువాంజేరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల సందర్భంగా రూ.1.5లక్షల లంచం సొమ్ము, కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శరవణన్ నేతృత్వంలో ఆరుగురు అధికారులు తనిఖీలు జరిపారు. ఏసీబీ అధికారులు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి ఆ కార్యాలయం నుండి పారిపోయాడు. అతడిని ఏసీబీ అధికారులు పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతడు మాయమయ్యాడు. ఆ తర్వాత అతడు వెళ్ళిన మార్గంలో అధికారులు పరిశీలించగా ఓ చెత్తకుప్పలో నోట్ల కట్టలు లభించాయి.

కూవం నది ప్రవాహంలో కొట్టుకెళ్లిన కారు

● డ్రైవర్‌ను కాపాడిన పోలీసులు



ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురవాయిల్ కూవం నదీ కాలువ ప్రవాహంలో కొట్టుకెళ్లిన కారులో చిక్కుకున్న డ్రైవర్‌ను పోలీసులు కాపాడారు. నగరంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శివారు ప్రాంతాల్లోని చెంబరంబాకం, పుళల్, పూండి తదితర రిజర్వాయర్ల నీటి మట్టం పూర్తి స్థాయికి పెరిగింది. ఈ నేపథ్యంలో చెంబరంబాకం రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన నీటితో మధురవాయిల్ ఎంజీఆర్ విశ్వవిద్యాలయం సమీపంలోని అడయాళంపట్టు కూవం నది కల్వర్టు మునిగి వరద ప్రవాహం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజాము 4 గంటలకు మొగప్పెరుకు చెందిన సునీల్(54) తన కారులో కూవం నది పైఉన్న కల్వర్టులో దాటేందుకు ప్రయత్నిస్తుండగా కారు ప్రవాహంలో కొట్టుకెళ్లింది. అదృష్టవశాత్తు ఆ కారు కానువ గట్టును ఢీకొని ఆగిపోయిన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఎక్సకవేటర్‌తో అక్కడకు చేరుకుని కారుకు తాడు కట్టి బయటికి తీశారు. కారులో చిక్కుకున్న సునీల్‌ను ప్రాణాలతో కాపాడారు.

వారం రోజుల తర్వాత చేపల వేటకెళ్లిన జాలర్లు

అడయార్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా రామేశ్వరం జాలర్లు వారం పది రోజులుగా చేపల వేటకు దూరంగా ఉన్నారు. అయితే, శుక్రవారం నుంచి వర్షం తగ్గిపోవడంతో ఈ ప్రాంతానికి చెందిన జాలర్లు చేపల వేటకు వెళ్లారు. ప్రధానంగా రామేశ్వరం, పాంబన్, మండపం, ఏర్వాడి, తొండి తదితర 50కుపైగా గ్రామాలకు చెందిన జాలర్లు శనివారం చేపల వేటకు వెళ్లారు.

అదృష్టం అలా తలుపు తట్టింది

● తేజు అశ్విని

చిత్రజ్యోతి



తనకు హీరోయిన్ రూపంలో అదృష్టం తలుపుతట్టిందని యువ కథానాయిక తేజు అశ్విని అంటున్నారు. సాధారణంగా సినిమాల్లో అవకాశం రావాలంటే అదృష్టంతో పాటు ఇతరుల అండదండలుండాలి. కానీ, ఈ యువతికి మాత్రం డైరెక్ట్‌గా హీరోయిన్ అవకాశం వరించింది. హీరో చెల్లి, హీరోయిన్ స్నేహితురాలు వంటి పాత్రల్లో నటించిన తర్వాతే హీరోయిన్‌గా అవకాశాలు వస్తుంటాయని పలువురు హీరోయిన్లు చెప్పిన సందర్భాలున్నాయి. కానీ, తేజు విషయంలో మాత్రం ఇది వర్తించదు. దీంతో ఆమె సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలోని విషయాలను పరిశీలిస్తే...

? మీ నేపథ్యం

! మా సొంతూరు ఏపీలోని విజయవాడకు సమీపంలో ఉన్న ఓ గ్రామం. బాల్యంలోనే చెన్నై వచ్చి స్థిరపడిపోయాం. నాన్న సంగీత కళాకారుడు. పాఠశాల, కాలేజీ విద్య చెన్నైలో పూర్తి చేసి, ఎంఏ పట్ట అందుకున్నా. స్కూల్‌లో చదువుతున్నప్పటి నుంచే డ్యాన్స్ అంటే మహాయిష్టం. బ్యాడ్మింటన్, కోకో, హాకీ, క్యారమ్‌బోర్డ్ వంటి ఆటలు ఆడుతూ అనేక మ్యాచ్‌ల్లో గెలిచాను.

? తొలి సినీ అవకాశం

! 2018లో తొలిసారి 'కల్యాణ సమయల్ సాదమ్' అనే పేరుతో రూపొందిన వెబ్ సిరీస్‌లో నటించాను. ఇది కొవిడ్ సమయంలో రావడం, మంచి విజయం సాధించింది. ఈ వెబ్ సిరీస్‌తో కూడా పాపులర్ అయ్యాను. ఒక్కొక్కరు నన్ను గుర్తుపట్టడం ప్రారంభించారు. అదేసమయంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూడా ప్రోత్సహించారు. 'అస్కుమారో' అనే ఆల్బమ్‌లో నటించగా, అది కూడా విజయం సాధించింది.

? హీరోయిన్ ఛాన్స్

! నేను నటించిన వెబ్ సిరీస్, ఆల్బమ్‌లను చూసిన దర్శక నిర్మాతలు హీరోయిన్‌గా అవకాశం ఇచ్చారు. 'కుక్ విత్ కోమాలి' ఫేం అశ్విన్ నటించిన 'ఎన్న సొల్ల పోగిరాయ్' అనే చిత్రంలో హీరోయిన్‌గా తొలిసారి నటించాను. ఇందులో నా పాత్రకు న్యాయం చేశాను. రెండో చిత్రం జీవీ ప్రకాష్ నటించిన 'బ్లాక్‌మెయిల్'. ఆ తర్వాత 'మూండ్రామ్ కణ్'లో నటించినా అది ఇంకా విడుదలకు నోచుకోలేదు.

? చేతిలో ఎన్ని ప్రాజెక్టులున్నాయి

! సినిమా అవకాశాలు వస్తున్నప్పటికీ మంచి కథల కోసం ఎదురు చూస్తున్నాను

? ఇష్టమైన హీరో

! ఫలానా హీరో అని చెప్పలేను. అందరితో నటించాలన్నదే నా కోరిక

? ఈ కొద్ది కాలంలో నేర్చుకున్నది

! చిత్రపరిశ్రమలో ఇపుడే అడుగుపెట్టాను. ఇండస్ట్రీ గురించి పెద్దగా తెలియదు. అనేక విషయాలు తెలుసుకోవాల్సి, నేర్చుకోవాల్సి ఉంది.

ఒకే విమానంలో విజయ్ - త్రిష



అగ్ర హీరో విజయ్, స్టార్ హీరోయిన్ త్రిష ఒకే విమానంలో ప్రయాణం చేశారు. చెన్నై నుంచి గోవాకు ప్రత్యేక చార్టెడ్ ఫ్లైట్‌లో వెళ్ళి, అక్కడ నుంచి ఒకే కారులో కలిసి వెళ్లిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల హీరోయిన్ కీర్తి సురేష్ వివాహం గోవాలో జరిగింది. ఈ వివాహానికి హీరో విజయ్ తమిళ సంప్రదాయ పంచెకట్టులో హాజరయ్యారు. ఇందుకోసం విజయ్ ఈ నెల 12వ తేదీ ప్రత్యేక విమానంలో గోవా వెళ్ళగా, అదే విమానంలో ప్రయాణం చేసిన మిగిలిన ఐదుగురు ప్రయాణికుల్లో త్రిష కూడా ఉన్నారు. గోవా ఎయిర్‌పోర్టు నుంచి వీరిద్దరూ ఒకే కారులో కలిసి వెళ్ళారు. ఈ ఫొటోలు లీక్ కావడంతో చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే, విజయ్ నటించే చిత్రాల్లో హీరోయిన్‌గా త్రిషకు వరుస అవకాశాలు ఇస్తుండటం కూడా అనేక ఊహాగానాలకు తావిస్తోంది.



మరుదమలై ఆలయంలో త్రిష ప్రత్యేక పూజలు

కోయంబత్తూరు జిల్లాలోని మరుదమలైలో జరుగుతున్న 'సూర్య-45' మూవీ షూటింగులో పాల్గొనేందుకు వెళ్ళిన ఆ చిత్ర హీరోయిన్ త్రిష స్థానికంగా ఉన్న ప్రసిద్ధ మరుదమలై సుబ్రమణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

జీవీ - సెల్వారాఘవన్‌ల 'మెంటల్ మనదిల్'



'మెంటల్ మనదిల్'లో జీవీ ప్రకాష్

ప్రముఖ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాష్ కుమార్ కథానాయకుడిగా సెల్వరాఘవన్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ సినిమాకు 'మెంటల్ మనదిల్' అనే టైటిల్ ఖరారు చేసి, ఫస్టులుక్‌ను ప్రముఖ హీరో ధనుష్ రిలీజ్ చేశారు. హీరోయిన్‌గా మాధురి జైన్ నటించనుండగా, ఇతర పాత్రల్లో పలువురు సీనియర్ నటీనటులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. తాజాగా విడుదల చేసిన మూవీ ఫస్టులుక్‌లో జీవీ ప్రకాష్ డిఫరెంట్‌గా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకున్నారు. గతంలో '7జీ రెయిన్‌బో కాలనీ', 'యారడి నీ మోగిని' వంటి సినిమాలను తెరకెక్కించిన సెల్వరాఘవన్ చాలా కాలం తర్వాత రొమాంటిక్ మూవీ తెరకెక్కిస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు, సెల్వరాఘవన్, జీవీ ప్రకాష్ కాంబినేషన్‌లో రానున్న తొలి చిత్రం కావడం కూడా విశేషం.

మణికంఠన్ హీరోగా 'కుడుంబస్తన్'



మణికంఠన్ హీరోగా గత యేడాది 'గుడ్‌నైట్', 'లవర్' పేర్లతో పేరుతో వచ్చిన సినిమాలు సూపర్‌హిట్ సాధించగా, ఇపుడు 'కుడుంబస్తన్' పేరుతో మరో చిత్రం తెరకెక్కుతుంది. రాజేశ్వర్ కాలిస్వామి దర్శకుడు. గతంలో పలు చిత్రాలకు అసిస్టెంట్‌గా పనిచేయగా, ఈ చిత్రం ద్వారా తొలిసారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శాన్వి మేఘన ఈ చిత్రం ద్వారా కోలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. వీరితో పాటు గురుసోమసుందరం మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'జీరో బ్యాలెన్స్ హీరో' పేరుతో సాగే తొలి సింగిల్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ సినిమా గురించి దర్శకుడు రాజేశ్వర్ కాలిస్వామి మాట్లాడుతూ, 'చాలాకాలం క్రితమే స్క్రిప్టు సిద్ధం చేశాను. ఆ సమయంలోనే ఈ స్టోరీకి మణికంఠన్ హీరో అని నిర్ణయించుకున్నాను. ఈ విషయాన్ని మణికంఠన్‌కు చెప్పి, స్క్రిప్టు చేతికిచ్చాం. పది రోజుల పాటు దానిని చదవిన తర్వాత ఒకే చెప్పారు. మధ్య తరగతి యువకుడు ప్రతి రోజూ కుటుంబాన్ని నడిపించడం ఒక సాహసమే. ఇదే వన్ లైన్ స్టోరీ. కుటుంబ నేపథ్యంలో సాగే కామెడీ స్టోరీ. బాగా వచ్చింది. కోవై నేపథ్యంలో సినిమాను రూపొందించాం, త్వరలోనే విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.

ఏసీ కోచ్‌లో శుభ్రతకు ప్రాధాన్యం...

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

SUNDAY SPECIAL



లాండ్రి యంత్రాలను పరిశీలిస్తున్న కార్మికుడు



రైళ్ల నుంచి వచ్చిన దుప్పట్లు, దిండుకవర్లు, తువ్వాళ్లను గ్రేడ్ చేస్తున్న కార్మికులు

పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా పట్టాలపై భద్రతకు ప్రాధాన్యమిచ్చే రైల్వే శాఖ ఏసీ కోచ్‌లో ప్రయాణికులకు శుభ్రమైన బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు ఇచ్చి, వారికి సుఖవంతమైన ప్రయాణానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో బేసిన్‌బ్రిడ్జి వద్దనున్న బూట్ లాండ్రీ అటు రైల్వే ఉన్నతాధికారులు, ఇటు ప్రయాణికుల ప్రశంసలందుకుంటోంది.

- ఆంధ్రజ్యోతి, చెన్నై

● అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రైల్వే శాఖ ● ఏటా 60 కోట్ల దుప్పట్లు, దిండుకవర్లు శుభ్రం ● ప్రశంసలందుకుంటున్న బేసిన్ బ్రిడ్జ్ బూట్ లాండ్రీ

ప్రతియేటా రైళ్లలో 60 కోట్ల మంది ప్రయాణిస్తుంటారు. దూర ప్రాంతాలకు ఏసీ కోచ్‌ల్లో ప్రయాణం చేసేవారికి దుప్పట్లు, దిండు కవర్లు ఎంతో అవసరం. ఇలా రోజూ రాత్రిపూట ఏసీ బోగీల్లో ప్రయాణించే కోట్లాదిమందికి శుభ్రమైన దుప్పట్లు, దిండువర్లు సరఫరా చేయడమంటే అంత సులభమైన విషయం కాదు. 2010వ సంవత్సరం ముందు సంగతేమో గానీ, 2011 తర్వాత ప్రయాణికులకు పాలమీగడను తలపించే దుప్పట్లను, దిండువర్లను అందిస్తున్నారు. నగరంలోని బేసిన్‌బ్రిడ్జి వద్దనున్న బూట్ లాండ్రీ అటు రైల్వే ఉన్నతాధికారులు, ఇటు ప్రయాణికుల ప్రశంసలందుకుంటోంది. అధునాతనమైన భారీ యంత్రాల్లో ఓ పద్ధతి ప్రకారం కార్మికులు ఈ దుప్పట్లు, దిండు కవర్లు ఉతికి ఆరేసి మిషన్‌లో ఇస్త్రీ చేసి ఇస్తున్నారు. ఈ బూట్ లాడ్రీ నుంచి ప్రతిరోజూ వివిధ నగరాలకు వెళ్లే రైళ్లలో ఏసీ కోచ్‌ల్లో ప్రయాణించేవారికి శుభ్రమైన, మృదువైన దుప్పట్లు, తువాళ్లు, దిండువర్లు సరఫరా చేస్తున్నారు. ఈ బూట్ లాండ్రీని రూ.11.17కోట్లతో ఏర్పాటు చేశారు. ఇక్కడ స్టీమ్ వాష్, ఆటోమేటిక్ డ్రయింగ్, ప్రెస్సింగ్, ఫోల్డింగ్ చేసే యంత్రాలున్నాయి. ఈ లాండ్రీలోని కార్మికులు వాసిన దుప్పట్లు, తువ్వాళ్లు, దిండువర్లను యంత్రాల్లో వాటి కెపాసిటీకి తగినట్లు జాగ్రత్తగా వేస్తే చాలు.. ఉతకడం, ఆరబెట్టడం, మడచిపెట్టడం, ఇస్త్రీ చేయడం తదితరాలన్నీ యంత్రాలే చకచకా చేసేస్తాయి. క్లోజింగ్ పాయింట్‌లో ఇస్త్రీ చేసిన తర్వాత వచ్చే దుప్పట్లు, తువ్వాళ్లు, దిండువర్లను కార్మికులు జాగ్రత్తగా ప్యాకింగ్ చేస్తే చాలు. వాటిని తీసుకెళ్లడానికి రైల్వే కార్మికులు వస్తారు. ఇలా రోజుకు ఈ బూట్ లాండ్రీలో 18 టన్నుల దుప్పట్లు, తువ్వాళ్లు, దిండువర్లను యంత్రాల ద్వారా ఉతుకుతున్నారు. కార్మికులు మూడు షిప్ట్‌ల్లో పని చేస్తుంటారు. రోజూ 40 వేల బెడ్‌షీట్లు, 20 వేల తువ్వాళ్లు, 20 వేల దిండువర్లు, 700 బ్లాంకెట్లను ఈ లాండ్రీలో ఉతికి ఇస్త్రీ చేసి సరఫరా చేస్తున్నారు. ఈ లాండ్రీలో ఉతికేవాటిని చివరగా తనిఖీ చేసే యంత్రం కూడా ఉంది. ఆ యంత్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే ఈ దుస్తులను ప్రయాణికులకు అందించేందుకు పంపుతారు. ఆ యంత్రం నిరాకరించిన దుస్తులను కార్మికులు మళ్లీ ఉతికేందుకు వేయాల్సిందే. ఇంతటి జాగ్రత్తల నడుమ బేసిన్ బ్రిడ్జి బూట్ లాండ్రీ రైలు ప్రయాణికుల శుభ్రతకు ప్రాధాన్యతినిచ్చి దుప్పట్లు, తువ్వాళ్లు, బ్లాంకెట్లను అందిస్తోంది.







బెడ్‌షీట్ క్వాలిటీ పరిశీలన



కాగితపు కవర్‌లో ప్యాకింగ్ చేసిన దుప్పట్లు, తువ్వాళ్లు



ఇస్త్రీ యంత్రం నుండి వెలుపలకు వస్తున్న బ్లాంకెట్లను మడచిపెడుతున్న కార్మికులు



ఏసీ కోచ్ ప్రయాణికులకు కంబళ్లను సిద్ధం చేస్తున్న కార్మికురాలు



ఒక్కో ప్రయాణికుడికి అందించే దుప్పట్లు, తువ్వాళ్లు, బ్లాంకెట్

కుమరిలో అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి

టి.నగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక స్థలంగా తీర్చిదిద్దే పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ సంచాలకులు శిల్పా ప్రభాకర్ సతీష్ తెలిపారు. కన్నియాకుమారి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పూంపుహార్ నౌకాయాన సంస్థ బోట్‌హౌస్, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతం, సూర్యోదయ త్రివేణి సంగమ ప్రాంతం, సూర్యాస్తమయ ప్రాంతం తదితర ప్రదేశాలను జిల్లా కలెక్టర్ అళగుమీనా ఇతర అధికారులతో కలిసి పర్యాటక శాఖ డైరెక్టర్ సందర్శించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కన్నియాకుమారిని అంతర్జాతీయ స్థాయీ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దటానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని చెప్పారు. ఆ మేరకు తిరువళ్లువర్ విగ్రహప్రాంతం వద్ద లేజర్ కాంతుల పథకానికి రూ.11.98 కోట్లు కేటాయించిందని, ప్రస్తుతం పూంపుహార్ షిప్పింగ్ కార్పొరేషన్ ప్రాంగణంలో కూర్చునే పర్యాటకులు తెరపై ఆ లేజర్ కాంతులు చూసే సదుపాయం కూడా ఉందన్నారు. ఇటీవలి కాలంలో కన్నియాకుమారికి దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది పర్యాటకులు విచ్చేస్తున్నారని, సెలవలు, పండుగ రోజుల్లోనే కాకుండా సాధారణ రోజులలోనూ వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చి సూర్యోదయ, సూర్యాస్తమయ ప్రాంతాలు, త్రివేణి సంగమ ప్రాంతం, వివేకానంద స్మారక మండపం, తిరువళ్లువర్ విగ్రహం ప్రాంతాలను సందర్శిస్తున్నారని ఆమె వివరించారు. ప్రస్తుతం తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతం వివేకానంద స్మారక మండపం మధ్య అద్దాల వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితులలో ఈ ప్రాంతంలో పర్యాటకులకు అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు కల్పించనున్నామని, త్రివేణి సంగమ ప్రాంతం వద్ద, స్విమ్మింగ్‌పూల్స్ ఉన్న ప్రాంతం వద్ద నీడనిచ్చే గొడుగులు, చిన్నారుల కోసం పార్కులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. కన్నియాకుమారి రౌండ్‌ఠాణా నుండి గాంధీ మండపం దాకా, సన్‌సెట్ పాయింట్, జీరోపాయింట్, భగవతి అమ్మన్ ఆలయ ప్రాంతం, వివేకానందపురం తదితర ప్రధాన రహదారులలో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.



కన్నియాకుమారిలో అధికారులతో కలిసి పరిశీలిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ శిల్పా ప్రభాకర్ సతీష్

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు



వేలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కార్తీక దీపోత్సవాలు ఈ నెల 4న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయ. వేడుకల్లో ప్రధానాంశంగా శుక్రవారం తెల్లవారుజామున 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో భరణిదీపం, సాయంత్రం 6 గంటలకు ఆలయం వెనుక వైపున్న కొండపై మహాదీపం వెలిగించారు.

పౌర్ణమి ఘడియలు...

పౌర్ణమి రోజున అరుణాచలేశ్వర ఆలయ చుట్టూ ఉన్న 14 కి.మీ గిరి ప్రదక్షిణ చేస్తే ముక్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఆ ప్రకారం, ఈ నెల పౌర్ణమి ఘడియలు శనివారం సాయంత్రం 4.17 గంటలకు ప్రారంభమై ఆదివారం మధ్యాహ్నం 3.13 గంటల వరకు కొనసాగనుంది. దీంతో, గిరి ప్రదక్షిణ చేసేందుకు వచ్చిన లక్షలాది మంది భక్తులతో గిరి ప్రదక్షిణ మార్గం కిటకిటలాడింది. ఈ సందర్భంగా రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు, దక్షిణ రైల్వే ప్రత్యేక రైళ్లు నడిపింది. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 16వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



మద్రాస్ క్రిస్టియన్ కళాశాల ప్రాంగణంలో ఎంసీసీ-ఎంఆర్‌ఎఫ్ ఇన్నోవేషన్ పార్కును శనివారం ప్రారంభిస్తున్న ఉప ముఖ్య మంత్రి ఉదయనిధి

సెంటార్ బిల్లింగ్ కార్యాలయం ప్రారంభం

చెన్నై, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన ఆరోగ్య సంరక్షణ ఆదాయ వనరుల నిర్వహణ సంస్థ సెంటార్ బిల్లింగ్ రాజధాని నగరం చెన్నైలో తన వాణిజ్యకలాపాలను విస్తరించింది. ఆ మేరకు ఎంఆర్‌సీ నగర్‌లో టీవీహెచ్ బెల్సియా టవర్స్‌లో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యాలయాన్ని ప్రముఖ నటి రైజా విల్సన్ జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభించారు. ఈ కార్యాలయంలో 300 మంది ఉద్యోగులు పనిచేయనున్నారు.



ఎంఆర్‌సీ నగర్‌లో సెంటార్ బిల్లింగ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నటి రైజా విల్సన్

23వ తేదీ వరకు

కార్తీక మహాదీపం దర్శనం

అడయార్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరాలయ కార్తీక దీపోత్సవాల్లో భాగంగా మహాదీప వేడుకలు శుక్రవారం శోభాయమానంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా మహాదీపాన్ని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు వెలిగించగా, లక్షలాది మంది భక్తులు ప్రత్యక్షంగాను, కోట్లాది మంది భక్తులు టీవీల్లో చూసి దర్శనం చేసుకున్నారు. అయితే ఈ మహాదీపం ఈ నెల 23వ తేదీ వరకు వెలుగుతుంది. అప్పటివరకు భక్తులు దర్శనం చేసుకోవచ్చు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు వెలిగించి, మరునటి రోజు ఉదయం 6 గంటలకు ఆర్పివేస్తారు. అందువల్ల భక్తులు ఈ మహాదీపాన్ని ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి మరునటి రోజు ఉదయం 6 గంటల వరకు దర్శనం చేసుకోవచ్చు.











తెలిమంచు కరిగింది.. తలుపు తీయవా ప్రభూ!





మంచు మబ్బుల గూటిలో ఎర్రనయ్య ఒదిగి కూర్చుంటాడు. రెక్కలు విప్పని పిట్ట ఎండ సెగ కోసం ఎదురు చూస్తుంది. తెల్లవారినా దృశ్యం మసకబారే కనిపిస్తుంది. ఎండ చురుకు తగలదు. పువ్వూ ఆకూ చెట్టూ సమస్తమూ తడికి ముడుచుకుంటాయి. రాత్రి కురిసిన మంచు ముత్యాలు సాలెగూటిమీద వాలి తళుకుమంటాయి. ఉండి ఉండీ ఒక జల్లు చినుకులు చిలకరిస్తుంది. చెట్టునుంచి రాలిన పూలు బాటను పరిమళభరితం చేస్తాయి. పచ్చని ఒడిలోంచి గోపురం తొంగి చూస్తుంది. సూర్యభగవానుడికి చేతులు జోడించి గరుడుడు వెచ్చదనాన్ని వేడుకుంటాడు. ఎటు చూసినా మంచు తెరల మనోహర సౌందర్యం కనువిందు చేస్తుంది. తిరుపతి పరిసరాల్లోని ఈ మంచు అందాలను కెమెరాలోకెక్కించి అందిస్తున్నారు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్.



దర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులూ, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులూ వేచి ఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 61,178

తలనీలాలు సమర్పించినవారు: 22,464







SUNDAY SPECIAL

జయహో.... సిద్ధవరం

నేలను తాకుతూవుండే పూరిగుడిసెలు.. ఒంటిమీద గోచి, చెరువుల్లో చేపల వేట, పొలాల్లో ఎలుకలు పట్టడం, మామిడి తోటల్లో కాపలా ఉండడం.. కార్యాల పేరుతో తాగడం.. ఒళ్లు తెలియకుండా డుబ్బుంకు వాయిస్తూ ఆడడం.. మాట మాటకూ తుళ్లిపడి నవ్వడం.. యానాదిపాళెం అనగానే గుర్తొచ్చే దృశ్యాలు ఇవి. మహా సిగ్గరులైన వీరు మైదాన ప్రాంత జనాలతో పెద్దగా కలవరు. మంచితనం, అమాయకత్వం మూర్తీభవించిన గిరిజనం వీరు. తరాలు గడిచినా వీరి జీవన విధానంలో స్వల్ప మార్పులే వచ్చాయి. వీరి జీవితానికి అద్దంపట్టే కథలు కరుణకుమార రాశారు. వీరి అభ్యున్నతి కోసం వెన్నెలకంటి రాఘవయ్య కలలు కన్నారు. కృషి చేశారు. ఆయన గతించిపోయినా.. ఆయన కన్న కలలు ఇప్పుడు నిజం అవుతున్నాయనేందుకు సాక్ష్యం కోట మండలంలోని సిద్ధవరం ఎస్టీకాలనీ. మిద్దెలు.. పేడ కళ్లాపి చల్లి ముగ్గులు దిద్దిన వాకిళ్లు.. అరటి, చింత చెట్లున్న పెరళ్లు.. విరబూసిన పూలమొక్కలు.. చదువుల లోగిలిగా మారిన ఆ పల్లె.. వెనుకబాటుతనంపై విజయం సాధించి.. అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

కథనం

కోట, ఆంధ్రజ్యోతి

ఆ పల్లెపేరు సిద్ధవరం. తిరుపతి జిల్లా కోట మండలంలో ఉన్న పల్లె అది. అన్ని ఊళ్లలో లాగే ఆ ఊరి చివరా 70 కుటుంబాల గిరిజన కాలనీ ఉంది. చెరువుల్లో, బకింగ్‌హామ్ కెనాల్‌లో చేపలు పట్టుకుని అమ్ముకోవడం వాళ్ల జీవనాధారం. తరాలుగా సాగుతున్న ఈ సంప్రదాయానికి సిద్ధవరం గిరిజన కాలనీ స్వస్తి చెప్పింది. ఒకరొకరుగా చదువుకోవడం మొదలుపెట్టారు. సాధారణంగా టెన్త్ లోపలే వీరు బడికి బై చెప్పేస్తారు. చేపల వేట, పొలాల్లో కూలి పనులు, ఆటలు, సినిమాలు.. వీటితోనే జీవితం గడిపేసే వీరు కాలేజీ మెట్లెక్కుతున్నారు. అవకాశాలను అందుకుంటున్నారు. దీంతో ఈ చిన్న కాలనీలో 20 మంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ కాలనీకి చెందిన తుపాకుల అశోక్, రాజమండ్రిలోని నన్నయ్య యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పిల్లలకు చదువులు చెబుతున్నారు. ఒక అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు. ఒకరు ఏఎన్ఎంగా, ఒకరు ఆర్టీసీ కండెక్టర్‌గా, నలుగురు సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఒక ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఇద్దరు ఆఫీసు సబార్డినేట్‌లు, ఒక మహిళా కానిస్టేబుల్, ఒక రికార్డు అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ ఆడిటర్‌గా కూడా ఈ గిరిజన కాలనీ బిడ్డలు కుదురుకున్నారు. సిద్ధవరం గిరిజనకాలనీ నుంచి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లున్నారు. నలుగురు పోస్టుగ్రాడ్యుయేషన్ చేశారు. ఆరుగురు డిగ్రీ పాసయ్యారు. విశేషం ఏమిటంటే.. వీరంతా ప్రభుత్వ బడులు, కాలేజీల్లోనే చదువుకుని ఉద్యోగాలు సాధించినవారు కావడం. చదువుకున్న తర్వాత సమాజంలో తమకు లభిస్తున్న గౌరవం, ఆదరణ చూసి గిరిజన కాలనీలోని అన్ని కుటుంబాలవారూ సంప్రదాయ పనులకు స్వస్తిచెప్పి బడిబాట పడుతున్నారు. తమ పిల్లలను బడికి పంపుతున్నారు. చదువుకుని వివిధ కొలువుల్లో ఉన్న ఈ కాలనీవాసులు మిగిలిన వారిని కూడా చదువుల దిశగా ప్రోత్సహిస్తున్నారు. వారికి అండాదండా అందిస్తున్నారు.

చదువులే మా బతుకులు మార్చాయి



మా మాదిరిగా బిడ్డలు ఉండగూడదనుకన్నాం. కూలినాలి చేసుకుంటూనే బడికి పంపాం. చదువుకున్నారు. ఒకరు టీచరయ్యారు. ఇంకొకరికి గవర్నమెంటు నౌకరీలో కుదురుకున్నారు. ఒకప్పుడు పిడికెడు మెతుకులకోసం చెరువుల వెంటా, కయ్యల వెంటా తిరుగులాడిన మేము, మా బిడ్డల చదువుల పుణ్యం వల్ల నలుగురికి పెట్టగలుగుతున్నాం.

\- కాటి శాంతమ్మ, సిద్ధవరం

అమ్మ పెట్టిన చదువు భిక్ష ఇది

అమ్మానాన్నల కష్టాన్ని చూస్తూ పెరిగాను. కష్టపడి చదివాను. మంచి మార్కులే సాధించా. నాలాగా ఎందరినో తయారు చేయగల ఉద్యోగం వచ్చింది. సమాజంలో నాకు గౌరవ మర్యాదలు దక్కింది నా చదువు వల్లనే. నా మూలాలు ఎన్నటికీ మరవలేదు. మావాళ్లను చదువువైపు ప్రోత్సహిస్తున్నా.

\- తుపాకుల అశోక్, ప్రిన్సిపాల్, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ



వెన్నెలకంటి కలలు నిజం చేసిన గిరిజనపాళెం

వేటను వదిలి ఉద్యోగాల బాట

ప్రభుత్వ బడుల చదువులతోనే సాధించిన పల్లె

"ఇప్పటికీ ఆహార సేకరణ దశలోనే ఎక్కువగా ఆధారపడిన గిరిజన జాతి జనం వారు. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అడవి అంచు పల్లెల్లోనే వీరి ఆవాసం. సముద్రతీర ప్రాంతాల్లో చేపల వేట వీరి ప్రధాన వృత్తి. చేపల వేటకు వీరు చెరువులు, గుంటలు, పులికాట్ సరస్సుకే పరిమితం అవుతారు. మత్స్యకారుల్లా సముద్రం మీదకు వెళ్లరు. పట్టణ జీవితాన్ని ఇష్టపడరు. ప్రకృతికి దగ్గరగానే జీవిస్తారు. చదువు ఆలోచన ఉండదు. ఉద్యోగాల కోసం ప్రయత్నించరు. ఎస్టీ జాబితాలో ఉన్నా తమ కోసం ఉన్న పథకాల గురించిన అవగాహన కూడా లేని ఈ గిరిజన కాలనీలు తరాలుగా ఇప్పటికీ ఇలాగే ఉన్నాయి. ఈ మంకు సంప్రదాయాన్ని బద్దలు కొట్టింది సిద్ధవరం ఎస్టీ కాలనీ "

ధైర్య సాహసాలు కలిగిన నేత

ఈవీకేఎస్ రాజకీయ ప్రస్థానం



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఇళంగోవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

చెన్నై, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈవీకేఎస్ ఇళంగోవన్ ధైర్యసాహసాలు కలిగిన రాజకీయ నేతగా, కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడే కాంగ్రెస్ వాదిగా పార్టీలో సమున్నత స్థానం సంపాదించుకున్నారు. అన్నాడీఎంకే మాజీ నేత జయలలితను, డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిని సిద్ధాంత పరంగా కొన్నిమార్లు తీవ్రంగా విభేదించారు. సిద్ధాంతపరంగా విమర్శించడమే తప్ప, ఎక్కడా వ్యక్తిగత విమర్శలకు దిగరని ఆయనకు రాజకీయవర్గాల్లో మంచి పేరుంది. ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ కుటుంబం నుండి వచ్చిన ఈవీకేఎస్ ఇళంగోవన్ తొలినాళ్లలో ద్రవిడ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆయన తండ్రి ఈవీకే సంపత్ ద్రవిడ ఉద్యమ నేతగానే రాజకీయాల్లో కొనసాగి ఆ తర్వాత అన్నాదురై స్థాపించిన డీఎంకేలో చేరారు. ఇక ఇళంగోవన్ తల్లి సులోచన అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శిగా ఉండేవారు. తల్లిదండ్రులు చెరో పార్టీలో ఉన్నా, ఆ రెండు పార్టీలకు ఇళంగోవన్ దూరంగానే ఉన్నారు. తమిళ సినీ నటుడు శివాజీగణేశన్ వీరాభిమాని అయిన ఇళంగోవన్ ఆయన ఆశీస్సులతోనే కాంగ్రెస్‌లో ఉన్నత స్థితికి చేరుకున్నారు. రాజధాని కళాశాలలో చదువుతున్నప్పుడే ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 1977లో శివాజీగణేశన్‌ను రాజకీయగురువుగా చేసుకుని రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1984లో శివాజీ గణేశన్ సిఫార్సు మేరకు ఇళంగోవన్‌కు ఈరోడ్ జిల్లా సత్యమంగళం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అవకాశం లభించింది. ఆ ఎన్నికల్లో గెలిచి ఆయన శాసనసభలో అడుగుపెట్టారు. ఎంజీఆర్ మృతి తర్వాత అన్నాడీఎంకే రెండు ముక్కలుగా చీలినప్పుడు శివాజీతో పాటు ఇళంగోవన్ ఎంజీఆర్ సతీమణి జానకి రామచంద్రన్‌కు మద్దతు ప్రకటించారు. కొద్ది రోజులకే జానకి రామచంద్రన్ ప్రభుత్వం పతనం కావటంతో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో శివాజీగణేశన్ తమిళగ మున్నేట్ర మున్నాని పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించారు. జానకి రామచంద్రన్ పార్టీతో పొత్తు పెట్టుకుని పోటీ చేశారు. ఇళంగోవన్ ఆ ఎన్నికల్లో తమిళగ మున్నేట్ర మున్నాని తరఫున భవానీ నియోజకవర్గంలో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల తర్వాత శివాజీగణేశన్ తన పార్టీని వీపీసింగ్ నాయకత్వంలో జనతాదళ్‌లో విలీనం చేశారు. దీంతో ఇళంగోవన్ మళ్ళీ కాంగ్రెస్ వైపు దృష్టి సారించారు. అప్పటి సీనియర్ నేత వాళప్పాడి రామమూర్తికి కుడిభుజంగా మారారు. పార్టీ అధిష్ఠానంతో పలుకుబడి కూడా పెంచుకున్నారు. అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా, సీతారామ్ కేసరి వంటి జాతీయ నాయకులతో సంబంధాలు ఏర్పరచుకున్నారు. 1996 లోక్‌సభ ఎన్నికల్లో కృష్ణగిరి నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో ఓటమికి ముందే తమిళ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీకే మూపనార్, వాళప్పాడి రామమూర్తి, పి.చిదంబరం తదితరులు పార్టీ నుంచి వైదొలగి తమిళ మానిల కాంగ్రెస్ పేరుతో పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలో రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలను పార్టీ అధిష్ఠానవర్గం ఇళంగోవన్‌కు అప్పగించింది. 1996 నుంచి 2001 వరకు టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా సేవలందించారు. 2002లో కాంగ్రెస్ పార్టీలో తమిళ మానిల కాంగ్రెస్ విలీనం కావటంతో జీకే వాసన్ కోసం టీఎన్‌సీసీ అధ్యక్ష పదవి సైతం ఇళంగోవన్ వదలుకున్నారు. 2004లో అప్పటి గోపిచెట్టి పాళయం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచి మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలో జౌళిశాఖామంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2009లో ఈరోడ్ లోక్‌సభ నియోజకవర్గంలో, 2014లో తిరుప్పూరు లోక్‌సభ నియోజకవర్గం, 2019లో తేని లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014-2016 వరకు మళ్ళీ టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా సేవలందించారు. 2016లో డీఎంకే నేత కరుణానిధితో ఇళంగోవన్ చర్చలు జరిపి కాంగ్రెస్‌కు 41 సీట్లు సంపాదించగలిగారు. అయితే ఆ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘోరపరజయాన్ని చవి చూసింది. ఆ ఓటమికి బాధ్యత వహించి టీఎన్‌సీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నారు. 2023లో ఈరోడ్ ఈస్ట్ శాసనసభనియోజకవర్గం సభ్యుడిగా ఉన్న ఇళంగోవన్ పెద్ద కుమారుడు తిరుమగన్ గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆ తర్వాత ఆ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇళంగోవన్ పోటీ చేసి గెలిచారు. 39 యేళ్ల తర్వాత మళ్ళీ శాసనసభలో అడుగుపెట్టారు.

2.21 కోట్ల రేషన్ కార్డు దారులకు
పొంగల్ కానుక

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే జనవరిలో పొంగల్ పండుగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా 2.21 కోట్ల రేషన్ కార్డుదారులకు రూ.1000 నగదు, పచ్చి బియ్యం, బెల్లం, చెరకు గడలను రాష్ట్ర ప్రభుత్వం పొంగల్ కానుకగా అందజేయనుంది. తమిళులు జరుపుకునే పండుగల్లో ఒకటైన పొంగల్ 2025 జనవరి 14న జరుపుకోనున్నారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పొంగల్‌కు రేషన్ దుకాణాల ద్వారా ఉచిత చీరా, దోవతులను ఈ నెలాఖరుకే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం నేత కార్మికుల సహకార సంఘాలు 1.75 కోట్ల దోవతులు, 1.75 కోట్ల చీరలు తయారు చేసి సిద్ధంగా ఉంచాయి. మరోవైపు రేషన్‌కార్డుదారులకు కిలో పచ్చి బియ్యం, చక్కర, చెరకు గడ రూ.1000 నగదుతో కూడిన కిట్ కానుకగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం లబ్దిదారుల ఎంపిక జరుగుతోంది. పౌర సరఫరాల శాఖ అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా పొంగల్ కానుకకు సంబంధించిన నిధులను ప్రభుత్వం త్వరలోనే కేటాయిస్తుందని సచివాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

తూత్తుకుడిలో మూడో రోజూ స్తంభించిన ప్రజారవాణా

అడయార్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తిరునెల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి జిల్లాల్లో గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా తూత్తుకుడి జిల్లాలో కురిసిన భారీ వర్షం కారణంగా అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. జిల్లాలోని కోరంపల్లం ప్రాంతంలోని కలెక్టరేట్, ఎస్పీ, ఆర్డీవో కార్యాలయాల్లో సుమారు నాలుగడుగుల మేరకు నీరు చేరింది. దాదాపు 10 వేలకు పైగా గృహాలు నీట మునిగాయి. వరుసగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా తమిరభరణి నది నుంచి నీటిని విడుదల చేయడంతో అనేక ప్రాంతాల్లో రోడ్లు తెగిపోయాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



చెన్నై మింట్ ఫ్లైఓవర్ ప్రాంతంలో సీఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన గృహసముదాయల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

కొడియకరైలో వెనక్కి మళ్లిన సముద్రం



పెరంబూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీ సమీపం కొడియకరై సముద్రం శనివారం సాయంత్రం హఠాత్తుగా వెనక్కి వెళ్లింది. బంగాళాఖాతంలో గత వారం శ్రీలంకకు సమీపంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో, దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ఆదివారం అల్పపీడనంగా మారడంతో, రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. శనివారం ఉదయం నుంచి వేదారణ్యం ప్రాంతంలో దక్షిణ దిశగా వీస్తున్న గాలుల వేగం అధికంగా ఉంది. అంతలో సాయంత్రం కొడియకరై ప్రాంతంలో హఠాత్తుగా సముద్రం వెనక్కివెళ్లింది. ఆ సమయంలో ఎలాంటి అలల ఉధృతి లేకుండా ప్రశాంతంగా సముద్రం కనిపించిందని జాలర్లు తెలిపారు.

మాదకద్రవ్యాల విక్రయం: ఏడుగురి అరెస్టు

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు ప్రాంతంలో 'మెథాకెటామిన్' అనే మాదకద్రవ్యాన్ని విక్రయించిన కళాశాల విద్యార్థి సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు. కోయంబేడు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం శుక్రవారం సాయంత్రం అక్కడ నిఘా వేసింది. ఆ సమయంలో మెథాకెటామిన్ విక్రయించిన కేళంబాకంలోని ఓ కళాశాలలో చదువుతున్న అర్జున్ (22), అతడి స్నేహితుడు తుల్‌కాపియన్ (23)లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఆరు గ్రాముల మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాన్ని సరఫరా చేసిన మరో ఐదుగురి వివరాలు తెలియడంతో వారిని కూడా అరెస్టు చేశారు. ఈ ముఠాతో సంబంధాలున్న వ్యాపారుల వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు కేరళ యువకుల అరెస్టు...

హౌరా ఎక్స్‌ప్రెస్‌లో చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు గంజాయి తరలించిన ఇద్దరు కేరళ యువకులను శనివారం ఉదయం అరెస్టు చేసి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కేరళ రాష్ట్రం కొల్లం ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్ (43), షైజో (47) అని తెలిసింది. వారిని కోర్టులో హాజరుపరచిన అనంతరం పుళల్ జైలుకి తరలించారు.

రోబోలతో పరిసరాల పరిశుభ్రత

- వరల్డ్ రికార్డు సాధించిన కోవై జిల్లా విద్యార్థులు

ప్యారీస్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా ఉత్తుపాళయంలో కేపీఆర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సైన్స్ అండ్ రీసెర్చ్ కళాశాలలో డేటా ఎనాలసిస్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు రోబోలతో పరిసరాలను శుభ్రం చేసి వరల్డ్ రికార్డ్ బుక్‌లో స్థానం దక్కించుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో భాగంగా కేపీఆర్ కళాశాల విద్యార్థులు ఈ 70 రోబోలతో 25 నిమిషాల్లోనే 1,500 చదరపు అడుగుల పరిసరాలను శుభ్రం చేయించి ప్రపంచ రికార్డ్ సాధించారు. ఈ సందర్భంగా కేపీఆర్ కాలేజ్ విద్యాకమిటీ అధ్యక్షులు కేపీ రామస్వామి, కార్యదర్శి గాయత్రి అనంతకృష్ణన్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కేంద్ర, రక్షణ మంత్రిత్వ శాఖ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నందకుమార్ మాట్లాడుతూ, ఈ విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని, భద్రత కోసం అధునాతన సెన్సార్, ఎలక్ట్రానిక్స్ పరికర సామర్థ్యంపై పరిశోధనలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. టెక్నాలజీ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో రోబోలు ప్రధానపాత్ర పోషించబోతున్నయని ఆయన అభిప్రాయపడ్డారు. జడ్జి కవిత జైన్ విద్యార్థులను అభినందించి ఇండియా అండ్ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్ ధ్రువీకరణ పత్రాన్ని కళాశాల విద్యార్థులకు ప్రదానం చేశారు.